ప్రజాశక్తి
సోమవారం 21 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి చిన్నారావు, కొర్ర.శీనుల సమక్షంలో నూతన మండల కమిటీ ఎన్నికైంది. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా మొదిలి సహదేవ్, కార్యదర్శిగా వంతల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా కిలో వెంకట్, పి భాస్కరరావు, కే.అనురాధ, సహాయ కార్యదర్శులుగా పి.సూర్య కిరణ్, కే.మేఘన, టీ.ఇంద్ర, పి.బాలు, కమిటి సభ్యులుగా వి.నిఖిల్, పి.సంతోష్, ఎస్.సౌజన్య, ఎం.మల్లీశ్వరి, జీ.విజయ లక్ష్మి, బి.రోహిణిలతో పాటుగా 10 సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు సహదేవ్,అనిల్ కుమార్ మాట్లాడుతూ, మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు, కే.శీను, ఎస్.మత్యారాజు మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అందజేయాలన్నారు.

ఎన్నికైన నూతన సభ్యులు

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

-లోయలో పడిన ఆర్టిసి బస్సు
-ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
-మరమ్మతుకు నోచని రక్షణ గోడలు -పేరుకుపోయిన తుప్పలు, చెట్లు
-ఇవే ప్రమాదాలకు కారణం- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం వైజాగ్ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు లోయలో పడిపోయింది.38 మంది ప్రయాణిస్తున్న బస్ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

పాడేరు డిపోకు చెందిన తీష్ట్రాప్ బస్సు విశాఖపట్నం నుంచి పాడేరు వస్తుండగా, సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఘాటిలోని వ్యూపాయింట్ కు సమీపంలోని ఓ మలుపునకు ఎడమవైపు వేలాడుతున్న చెట్టు కొమ్మను ఢీకొనడంతో బస్సు కుడివైపున ఉన్న లోయలోకి పోయింది. ఈ ప్రమాదంలో పాడేరు మండలం బరిసింగి పంచాయతీ జి.కొత్తూరు గ్రామానికి చెందిన సీసా కొందన్న (52), సబ్బవరం మండలం సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నవర నారాయణ (55) మృతి చెందారు. ముంచంగిపుట్టు మండలం సరియాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో బోద్ రాజుకు నడుములో ఎముకలు విరిగిపోగా, అదే మండలం చిప్పాపుట్లు గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మికాంతంకు తలకు తీవ్రగాయం కాగా, నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామానికి చెందిన బుట్ట చిన్నామ్మలు, బస్ డ్రైవర్ కె.సత్తిబాబు తలపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన ఈ నలుగురు బాధితులకు పాడేరు జిల్లా ఆస్పత్రిలో తరలించి ప్రధమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవలకు విశాఖ కెజిహెచ్ కు తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు పాడేరు జిల్లా ఆసుపత్రిలోనే వైద్య చికిత్సలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.

ప్రమాదానికి కారణమైన చెట్టు కొమ్మ

ఘాట్ లో తుప్పలతో తిప్పలు

పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించే స్థానిక ఘాట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఎక్కడికక్కడ తుప్పలు అధికంగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపులు కనిపించని విధంగా ఉన్న ప్రాంతాల్లోని జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని డ్రైవర్లు ప్రయాణికులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో ఘాట్ మార్గంలోని ఇరువైపుల తుప్పలు విపరీతంగా పెరిగి పోయాయి. తుప్పలు పెద్దగా పెరిగి పోవడంతో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు అంటున్నారు. ఆయా మలుపుల వద్ద ఇరువైపులా తుప్పలు పెరిగి ఎదుటి వాహనాలు డ్రైవర్లకు కనిపించిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించని పరిస్థితిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డ్రైవర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు ఘాట్ లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సంబంధిత అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని వాహన చోదకులు ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి పాడేరు ఘాట్ రోడ్ లోని జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని వాన సదరులు ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘాట్ రోడ్డులో రక్షణ కరువు

పాడేరుటౌన్: పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించే స్థానిక ఘాట్ మార్గంలో రక్షణ కరువవుతోంది. ఘాట్ మార్గంలో రక్షణ గోడలు శిథిలమై ఏళ్లు గడుస్తున్నాయి. వాస్తవానికి ఎక్కడైనా ఘాట్ రోడ్లకు రక్షణ గోడలే ప్రధాన ఆధారం. కానీ వీటిపై అధికారులు దష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రం కావడంతో ఘాట్ మార్గంలో రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో స్థానిక ఘాట్ రక్షణపై ప్రభుత్వం దష్టి సారించాలని డిమాండ్ ఉత్పన్నమవుతున్నది. పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా, ఆయా ప్రాంతాల నుంచి పాడేరుతో పాటు ఒడిస్సా రాష్ట్రానికి వెళ్లాలన్నా ఘాట్ ప్రయాణం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ఘాట్ మార్గంలో రక్షణపై పాలకులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రధానంగా ఘాట్ లోని వ్యూ పాయింట్ కు సమీపంలో, రాజాపురం వద్ద, ఏసు ప్రభు బొమ్మ మలుపులకు అటూ, ఇటూ, వంటల మామిడి నుంచి గరికిబంద వరకు ఉన్న మలుపుల్లో రక్షణ గోడలు శిథిలమై పోయాయి. పొరపాటున వాహనాలు అదుపు తప్పితే.. లోయలోకి దూసుకుపోవాల్సిందే. గతంలో నిర్మించిన రక్షణ గోడలు శిథిలం కాగా చాలా ఏళ్లుగా కొత్త రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఘాట్ ప్రయాణం భయం..భయంగానే ఉందని డ్రైవర్లు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

లోయలో పడి పోయిన బస్

బాధితులను పరామర్శించిన మంత్రి అమర్‌నాథ్

-మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

పాడేరు టౌన్: పాడేరు ఘాట్ లో ఆర్ టిసి బస్సు లోయలో పడిన ఘటన ప్రదేశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆర్‌టిసి, పోలీస్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాడేరు చేరుకున్న మంత్రి ప్రమాద స్థలాన్ని పరిశీలించి అనంతరం, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను అమర్నాథ్ కోరారు. అవసరమైతే కేజీహెచ్ కు లేదా కార్పొరేట్ ఆసుపత్రులకైనా క్షతగాత్రులను తరలించి వారు పూర్తిస్థాయిలో కోలుకునే విధంగా వైద్య సహాయం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ విశాఖ నుంచి పాడేరు వస్తున్న ఆర్ టిసి బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిందని, ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని విశాఖ కేజీ హెచ్ కు తరలించామని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు 10 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని ఆయన చెప్పారు. శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి ఐదు లక్షలు, గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు. మంత్రి వెంట జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా, స్థానిక ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, ట్రైకార్ ఛైర్పర్సన్ బుల్లిబాబు, డిఆర్‌ఓ పి.అంబేద్కర్ ఉన్నారు.

బాధితుడిని పరామర్శిస్తున్న అమర్‌నాథ్, కలెక్టర్, ఎమ్మెల్యే

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ఆదివాసీ హక్కులను హరిస్తే ఊరుకోం

- సిపిఐ బస్ యాత్రలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసీ హక్కులను హరిస్తే ఊరుకోమని సిపిఐ బస్ యాత్రలో పలువురు వక్తలు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యాన రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల 17న ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్ర ఆదివారం చింతపల్లికి చేరుకుంది. ముందుగా చింతపల్లిలోని హనుమాన్ కూడలి వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ, నియంతృత్వ విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 9 ఏళ్ల మోడీ పాలనలో పేద ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. మాయ మాటలతో ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టిన మోడీ కులం, మతం పేరుతో పబ్బం గడుపు కుంటున్నారని విమర్శించారు. హిందువులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెడుతున్న నరేంద్ర మోడీ ఏ ఊరిలో వారికి ఏమి సంభవించిందో చెప్పాలని ప్రశ్నించారు. మైనార్టీలను అభద్రతా భావానికి గురి చేసి మెజార్టీ హిందువుల ఓట్లతో మరల అధికారంలోకి రావాలని మత ప్రాతిపదికన విభజన చేస్తున్నారని విమర్శించారు. మోడీ పాలనలో ప్రపంచంలోనే అత్యంత ధనికులుగా అంబానీ, ఆదానీలు ఎదిగారన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికీ రోడ్లు, కరెంటు, మంచినీరు లేని గ్రామాలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, గిరిజన చట్టాలు, హక్కులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. 1/70 చట్టం ఉన్నా ప్రభుత్వాల అండదండలతో గిరిజనేతరులకు చుట్టంగా మారిందన్నారు. భూ రక్షణ చట్టం, ఉపాధి చట్టం, జీవో 3 రద్దు చేసి అడవుల్ని బిజెపి ప్రభుత్వం ప్రవేట్‌పరం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకురాలు అత్తిలి విమల, యువజన సమాఖ్య నాయకుడు లెనిన్ బాబు, రాష్ట్ర విద్యార్థి సమాఖ్య నాయకుడు జాన్సన్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి చంద్రా నాయక్, ఏపీ యువజన సమాఖ్య నాయకుడు రాజేంద్ర ప్రజానాట్యమండలి నాయకుడు పెంచలయ్య జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు దీసరి బీమలమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, సింహాచలం, సేగ్గే కొండలరావు, అంజలి శనివారం సర్పంచ్ పేట్ల రాజబాబు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, చింతపల్లి జీకే వీధి సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శిలు పేట్ల పోతురాజు, కంకిపాటి సత్తిబాబు, పాంగి ధనుంజయ్ .గడుతూరి సత్యనారాయణ, సిపిఎం నాయకులు సాగిన చిరంజీవి జీవన్ కృష్ణ మజ్జి కిల్లో సింహాచలం రాంబాబు మేక సత్యనారాయణ, మఠం సూరి పడాల్, అమర్, జల్లి రాజబాబు, కూడా రాధాకృష్ణ, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తమ ఓట్లు గల్లంతైనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఓట్లు గల్లంతుతో బాధితులు లబోదిబో

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు పంచాయతీ పరిధిలో ఓట్లు గల్లంతుపై బాధిత ఓటర్లు లబోదిబోమన్నారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ సర్పంచ్ స్థానానికి శనివారం ఉప ఎన్నికలు నిర్వహించిన విషయం విధితమే. స్థానికులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఓటర్ స్లిప్పులు ఇవ్వాలని కోరగా, ఓటర్ జాబితాలో సుమారు 200 మంది పేర్లు కనిపించలేదు. గత ఎన్నికల్లో తాము ఓటు హక్కును వినియోగించుకున్నామని, ఇప్పుడు ఎందుకు లేవని బాధిత ఓటర్ రామస్వామితో పాటు మరి కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పేర్లు ఎందుకు ఓటర్ జాబితా నుంచి తొలగించారని వారు రాజకీయ నాయకులకు నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో చేర్చి 2024 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని వారు కోరారు.

200 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి రంపచోడవరం

రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జి.భాస్కర్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన 74 మందికి రక్త పరీక్షలు, ఐదుగురికి థైరాయిడ్ పరీక్షలు, పది మందికి ఎక్స్ రేలు, పది మందికి ఫిజియథెరపీలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, రామకృష్ణ మఠం మేనేజర్ స్వామీ రఘువీరనందజీ మహారాజ్, స్వామీ అర్చునానంద మహారాజ్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో క్యాంపు కో- ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు భోజన ఏర్పాట్లు చేశారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

జోరుగా సచివాలయ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన రేఖపల్లి గ్రామ సచివాలయానికి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కొత్త సచివాయాలనికి రంగులు, హంగులతో నిర్మాణం పూర్తి చేశారు. కొద్దిరోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఈ సచివాయాలనికి రోడ్డు ఏర్పాటుతో మరింత సౌకర్యవంతంగా ఉండనుంది. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని మాట్లాడుతూ పాత సచివాలయం ఇరుకుగా, ఇబ్బందిగా ఉందని, నూతన భవనం అందుబాటులోకి వస్తే సేవలు మరింత చేరువుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సీనియర్ నాయకులు పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు, చీరపు తాతబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ

జమాల్‌ఖాన్‌కు వైద్యరత్న అవార్డు

ప్రజాశక్తి-చింతూరు

గుంటూరు జిల్లా, అమరావతి, తాళాయపాలెంలోని శైవ క్షేత్రంలో పారం పర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగిన జాతీయ సంప్రదాయ వైద్యుల శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ మూలికా ఆయుర్వేద వైద్యులు ఎండి జమాల్ ఖాన్‌ను వైద్యరత్న అవార్డుతో సత్కరించారు. ఈ శిక్షణ శిబిరంలో దక్షిణ భారతదేశంలోని సంప్రదాయ వైద్యులు పాల్గొని వివిధ రకాల రుగ్మతలకు తాత్కాలిక, దీర్ఘకాలిక ఉపశమనం, నిర్మూలన అంశాలపై అనుభవ విధానాలను ఒకరి నుండి ఒకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 70 ఏళు పైబడి గురువులకు సన్మానించారు. జమాల్ ఖాన్‌తో పాటు కరోనా సమయంలో మందు ఇచ్చిన ఆనందయ్యను, నెల్లూరుకు చెందిన వేణుగోపాల్ రెడ్డిను ఫారంపర్య వైద్యరత్న అవార్డులతో పాటు సత్కరించి ధన్వంతరి స్వామి పంచలోహ విగ్రహాలను బహుకరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని, వాటి గురించి అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతరించిపోతున్న వనమూలిక వైద్యాన్ని బలోపేతం చేయాలన్నారు. మొండి రోగాలకు మూలికా వైద్యమే సరైనదని పేర్కొన్నారు. అనువంశికంగా కుటుంబంలో వారికి కూడా ఆయుర్వేదంపై అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బాలకృష్ణ, రామకృష్ణరాజు, పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వైద్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌ను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి- రంపచోడవరం

మండలంలోని ఇర్లపల్లి గ్రామం వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.... ఇర్లపల్లి వద్ద వృద్ధురాలు చింతపల్లి కన్నమ్మను గోకవరం వైపు నుండి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కన్నమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను 108 వాహనంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలు విరిగిపోయి సంఘటనా స్థలంలో ఉన్న వృద్ధురాలు

మధురవాడ డిపో వద్ద బస్సును లాంఛనంగా ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

సీలేరు నైట్ హాల్ట్ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు

మధురవాడ సీలేరు నైట్ హాల్ట్ బస్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ అనురాధ తెలిపారు. మధురవాడ నుంచి బయలుదేరి వయా విశాఖపట్నం, నర్సీపట్నం, చింతపల్లి మీదుగా సీలేరుకు ఈ బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ బస్సు ప్రతి రోజూ మధ్యాహ్నం రెండు గంటలకు మధురవాడ డిపోలో బయలుదేరి మూడు గంటలకు విశాఖపట్నం కాంప్లెక్స్, రాత్రి 9.45 గంటలకు సీలేరు చేరుకుంటుందని వెల్లడించారు. ఇక్కడ నైట్ హార్ట్ ఉండి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సీలేరులో బయలుదేరి మధురవాడ మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రాంత ప్రయాణికులు ఈ బస్ సర్వీస్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు విఆర్.పురం మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న మంగళవారం జరుగుతుందని, సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులం హాజరు కావాలని ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిడిఓ రత్నకుమారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గోదావరి వరదల అనంతరం జరుగుతున్న సమావేశం కానున్నందున, పలు అంశాలపై చర్చి, తీర్మానాలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి-చింతూరు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం చింతూరు సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ధరలు తగ్గించే విధంగా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు జవహర్, నరేష్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికుల హక్కులకు బిజెపి తూట్లు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: కార్మికుల హక్కులకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు దుయ్యబట్టారు. మండలం కేంద్రంలో సిఐటియు, మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కుల్ని పాలకులు కారాస్తున్నారన్నారు. సమ్మె హక్కు, ధర్నాలపై ఉక్కుపాదం మోపేందుకు పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టాలని చూస్తున్నారన్నారు. మతం పేరిట మతోన్మాద శక్తులు తెగల మధ్య చిచ్చు పెట్టి మరణ హోమం సృష్టిస్తున్నారని విమర్శించారు. కార్మికుల పోరాట ఫలితంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం దిక్కరించి కార్మికుల హక్కుల్ని కాలరాస్తుందని దుయ్యబట్టారు. కార్మికులంతా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు, మండల అధ్యక్షులు టి.రాజమ్మ, మండల కార్యదర్శి కె.సరబన్న, రామారావు, గంగాధరం, సుందర్ దేవ్, రాజు, భవాని శంకర్, లక్ష్మి దేవి పాల్గొన్నారు.

రాస్తారోకోనుద్దేశించి మాట్లాడుతున్న సన్నిబాబు

ఐసిడిఎస్ పిఒను సస్పెండ్ చేయాలని...

సిఐటియు ర్యాలీ, రాస్తారోకో

ప్రజాశక్తి పెదబయలు రూరల్: ఐసిడిఎస్ పిఒను సస్పెండ్ చేయాలని స్థానిక జిల్లా పరిషత్తు గెస్ట్ ఆఫీస్ నుండి సిఐటియు అనుబంధ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, సిబ్బందిని వేధింపులకు గురి చేస్తూ, దాడులకు పాల్పడిన పిఒను వెంటనే అరెస్టు చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పీవో రాజేశ్వరి అంగన్‌వాడి కేంద్రాలలో తనిఖీల పేరుతో కార్యకర్తలను, హెల్పర్లను దుర్భాసలాడుతూ కొడుతూ, వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. పీవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే బాధితులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గంజాయి సాగు నేరం

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో కిముడుపల్లిలో సిఐ సత్యనారాయణ ఆధ్వర్యాన గంజాయి వద్దు ప్రత్యామ్నాయ పంటలే ముద్దు పేరుతో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కిముడుపల్లి పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అందేవిదంగా పోలీసు శాఖ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. గంజాయి పంట పండించడం, రవాణా చట్ట రీత్యానేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

నినాదాలు చేస్తున్న గంగరాజు, గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి మండలం మారుమూల నాన్ షెడ్యూల్ రొంపల్లీ పంచాయతీ బూరుగ, చినకోనేల గ్రామాల్లో అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను రక్షణ కల్పించాలని, అక్రమ భూ రిజిస్ట్రేషన్, ముటేషన్‌కు పాల్పడిన ఆక్రమణదారులపై ఎసి ఎస్టీ అట్రాసిటి .క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీతో పాటు సీపీఎం బృందం పర్యటించింది. భూ అక్రమలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం సాగు హక్కు పత్రాలు కూడా ఇచ్చిందని, మైదాన ప్రాంతాలకు చెందిన కొంత మంది భు స్వాములు కన్నువేసి కబ్జాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, అన్యాక్రాంతం అవుతున్న గిరిజనుల భూములను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బూరుగ, చినకోనేల గ్రామాల్లో 60 గిరిజన నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటూ భూములను నమ్ముకొని తరతరాలుగా వ్యవసాయ పంటలు పండించుకొని జీవిస్తున్నారని తెలిపారు. వీరి భూములపై భూస్వాములు, రియల్ ఎస్టేట్ మాఫీయా కన్ను వేసి దోచేస్తున్నారన్నారు. దీనిపై అనేకసార్లు రెవిన్యూ అధికారులను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించి నప్పటికీ పట్టించుకోలేదన్నారు. అధికారులు భూ స్వాములకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు. లేకుంటే రైతులతో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. బూరుగ, చినకోనేల రైతుల నుండి 100 ఎకరాలకు పైబడి గిరిజనుల నుండి లాక్కున్నారని పేర్కొన్నారు. గిరిజనుల భూముల అన్యాక్రాంతంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావిస్తానని తెలిపారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించేలా జిల్లా చైర్మన్, కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా రెవిన్యూ యంత్రాంగం దీనిపై స్పందించి సాగు రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంల సిపిఎం నాయకులు మామిడి కృష్ణ, సురేష్, వార్డు మెంబర్ సోమెల అప్పలరాజు, కోటపర్తి సింహాచలం, జన్ని శంకర్, పెంటయ్య, సన్యాసిరావు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

సమావేశానికి హాజరైన విఒఎలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: ఐకెపి వివోఏల వేతనాల కోత, సమస్యలపై మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద సిఐటియు మండల ఉపాధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యాన విఒఎలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివిధ కారణాలతో వేతనాలలో కోత విధించడం దుర్మార్గమన్నారు. మహిళా మండలి సమైక్య సమావేశాలకు సుదూర ప్రాంతాల నుండి వస్తున్న మహిళలకు కనీసం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి బిల్లులు పెట్టి నిర్మాణాలు పూర్తి చేయకపోవడంపై ఆంతర్యం ఏమిటో తెలపాలని ప్రశ్నించారు. మహిళా మండలి సమైక్య కార్యాలయంలో సరైన కంప్యూటర్, ప్రింటర్, జెరాక్స్ వంటి సౌకర్యం లేవన్నారు. దీంతో వివోఏలు సొంత డబ్బులతో వివిధ రకాల పనులను నెట్ సెంటర్లలో చేయించుకోవాల్సి వస్తుందన్నారు. స్టేషనరీ బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. వివోఎల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు, ర్యాలీలు, రిలే దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకుడు ఎస్ గాసిరాం దొర, వివోఏల మండల అధ్యక్ష కార్యదర్శులు జ్యోతి, రాజారావు పాల్గొన్నారు.

అరకు సంతబయలులో అపారిశుధ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంత బయలు గ్రామంలోని రోడ్డు పక్కనే చెత్తా చెదారం పేరుకు పోవడంతో రాకపోకలకు వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అరకు, పాడేరు ప్రధాన రహదారికి అనుకుని ఉన్న సంత జరిగే జీసిసి గొడౌన్స్ ఎదురుగా ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్‌తో పాటు ఇతర ప్లాస్టిక్ వస్తువులు కాలువల్లో నిండి ఉన్నాయి. దీనికి తోడు వర్షం కురవడంతో అవన్నీ ఒకేచోట నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ పరిసరాల్లోనున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి పేరుకు పోయిన అపారిశుధ్యాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అరకు సంతబయలులో పేరుకు పోయిన చెత్త

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గొలుగొండ: ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామానికి చెందిన గుడివాడ వరహాలబాబు నర్సీపట్నం మండలం పట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరిగి వస్తున్నాడు. గొలుగొండ మండలం వెంకటాపురం గ్రామ సమీపంలో వరహాలబాబు ద్విచక్ర వహనాన్ని మరో బైక్ ఢీకొంది. దీంతో వరహాలబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎం.నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని సీతపాలెం బీచ్‌లో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. బీచ్ సందర్శనకు వచ్చిన విద్యార్థి సముద్రంలో మునిగిపోయి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... విశాఖకు చెందిన కొట్టోజు సాయి, గన్నవరపు సాయి ప్రియాంక, గన్నవరపు రవి శంకర్, కొట్టోజు కావ్య, కండిపల్లి ఫణింద్ర, కండిపల్లి సాయి కిరణ్ తదితర ఆరుగురు విద్యార్థులు ఆదివారం ఉదయం సీతపాలెం బీచ్‌కు సందర్శనార్థం వచ్చారు. సముద్రం ఒడ్డున సగం మునిగిన రాతి బండలపైకి వెళ్లి ఫొటోలు తీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కొట్టోజు సాయి (19) పడిపోయి సముద్రం కెరటం తాకిడికి కొట్టుకుపోయాడు. సాయికి సమీపంలో ఉన్న గన్నవరపు సాయి ప్రియాంక ఈ ఘటనలో చిక్కుకొని బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగి సముద్రంలో గల్లంతైన సాయి కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల సమయంలో సాయి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై రాంబిల్లి ఎస్ఐ దీనబంధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జోగారావుపేట గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కొత్తపల్లి సిరి (11) అనేక బాలిక ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లి నూకరాజు కుమార్తెలు సిరి (11) మాధురి (9) ఇద్దరూ కలిసి తమ వ్యవసాయ పొలానికి వెళ్ళారు. ఆవుకు నీరు పెట్టేందుకు సిరి తమ విద్యుత్ మోటార్ ప్లగ్ వేయగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలింది. ఇది గమనించిన చెల్లి మాధురి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వెంటనే సిరిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కశింకోట అదనపు ఎస్ఐ పిడి సుందరమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఐదవ తరగతి చదువుతోంది. సిరి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మత్స్యకారుడు గల్లంతు

ప్రజాశక్తి-ములగాడ : నేవల్ డాక్‌యార్డు బ్రిడ్జి వద్ద చేపల వేట చేస్తూ ఓ మత్స్యకారుడు సముద్రంలో గల్లంతయ్యాడు. మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... విశాఖ జాలారిపేటకు చెందిన ఎం.ఎర్రయ్య (40) ఆదివారం మధ్యాహ్నం డాక్‌యార్డు బ్రిడ్జి వద్ద ఉన్న జట్టీ వద్దకు వచ్చి చేపల వేట చేస్తున్నాడు. చేపలు వేటచేస్తుండగా కాలు జారి పడి నీటిలో మునిగిపోయాడు. ఆ రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులందరూ చూస్తుండగానే మత్స్యకారుడు జారి పడిపోయి ఆచూకీ కనబడలేదు. ప్రయాణికులు మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. మల్కాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నేవల్ సిబ్బందికి సమాచారమిచ్చారు. నేవల్ సిబ్బంది గాలింపు చేపట్టారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కె.సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో చాపరాయి అభివృద్ధి పేరిట అధికారులు ప్రతి యేడాది టెండర్ పాట నిర్వహించే వారని తెలిపారు. ఈ ఏడాది ఐటిడిఏ ఆధీనంలో తీసుకుని నిర్వహణ కొనసాగిస్తుందన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ ఏడు నెలలు గడుస్తున్నా ఉపాధి కల్పించకపోవడం విచారకరమన్నారు. డిగ్రీ, బిఈడి, పీజీ, బీటెక్‌తో పాటు ఇతర ఉన్నత చదువులు చదివిన అనేకమంది నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, స్థానిక నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

వికెట్ తీసిన ఆనందంలో రాయలసీమ కింగ్స్ జట్టు ఆటగాళ్లు

రాయలసీమ కింగ్స్ గెలుపు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఎపిఎల్ సీజన్ 2 మ్యాచ్‌లు రంజుగా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌ని చూసేందుకు ప్రేక్షకుల ఎక్కువ సంఖ్యలో మైదానానికి వచ్చారు. గోదావరి టైటాన్స్ - రాయలసీమ కింగ్స్ జట్లు తలపడగా రాయలసీమ్ కింగ్స్ విజయం సాధించింది. తొలుత టాస్ గెలుచుకున్న రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మ్యాన్లు 20 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 150 పరుగులు సాధించారు. ఎనిమిదో స్థానంలో దిగిన బౌలర్ టి.విజయ్ కుమార్ అద్భుతమైన ఆట తీరు కనబరిచాడు. కేవలం 25 బంతుల్లో 5 సిక్స్‌లు, 6 ఫోర్లుతో 63 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ జట్టు 17.4 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 153 పరుగులు చేసి విజయం అందుకుంది. అభిషేక్ రెడ్డి 37 బంతుల్లో 2 సిక్స్‌లు, 7 ఫోర్లుతో 53 పరుగులు చేసి రాణించాడు.

మళ్లీ వచ్చేది వైసిపి ప్రభుత్వమే..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో వైసిపియేతర పార్టీలన్నీ ఒక్కటై వచ్చినా అవన్నీ జగన్మోహన్ రెడ్డి ముందు చిత్తుకాక తప్పదని, మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఉదయం బీచ్‌లోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను వైసిపి కైవసం చేసుకున్నప్పటికీ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే ఘన విజయాన్ని సాధించినట్లు కొన్ని పత్రికలు బాకా ఊదడాన్ని చూస్తే విడ్డూరంగా కనిపించిందని అన్నారు. అప్పుడప్పుడూ గెలిచే పార్టీలు ఇలాగే వార్తలు రాయించుకుంటాయని, సంబరాలు చేసుకుంటూ ఉంటాయని, వారి ఆనందాన్ని మేము ఎందుకు కాదంటామని అన్నారు. గత ఎన్నికల్లో కొడుకును కూడా గెలిపించుకోలేని చంద్రబాబు నాయుడు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని అన్నారు. జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తాయి అన్న విషయాన్ని ఏడాది కిందటి నుంచే తాము చెబుతున్నామని, ఇప్పటికి వారి మధ్య ఉన్న బంధం బయటపడిందని ఆయన అన్నారు.

ఆనందపురం ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'నాకు జీతం లేనప్పుడు మీకెందుకు జీతాలు ఇవ్వాలి' అని తన డిడిఒ లాగిన్ నుంచి తనే స్వయంగా బయటికి వెళ్లి పోయి జూన్ నెల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అనందపురం ఎంఇఒ ఎస్ఎస్.పద్మావతిపై జిల్లా కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంఇఒ పద్మావతి నిర్లక్ష్య వైఖరిపై గత నెల 10న విశాఖ జిల్లా కలెక్టర్‌కు తాము ఫిర్యాదు చేయగా చర్యలు కోసం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే ఈ రోజుకూ చర్యలు కానరాలేదని తెలిపారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత ప్రవేశం కోసం ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఎపి ప్రభుత్వంచే ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సివిల్ సర్వీసులు, గ్రూప్ 1, గ్రూప్-2 పరీక్షలకుగాను శిక్షణ ఇచ్చేందుకు ఈ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించామని సాంఘిక సంక్షేమ శాఖ విశాఖపట్నం ఉప సంచాలకులు జె.రామారావు మీడియాకు తెలిపారు. విశాఖపట్నంలో ఏడు సెంటర్లలో 3726 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2217 (60 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్ష జిల్లాలో ఎటువంటి అవాంతరాలూ లేకుండా విజయవంతంగా జరిగిందన్నారు.

గత స్మృతులకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీవితంలో మరుపురాని సన్నివేశాలను, గత స్మృతులను గుర్తుకు తెచ్చేవి ఛాయాచిత్రాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ స్థానిక బీచ్ రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ఆయన ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు అత్యంత కఠినమైన పరిస్థితుల్లో కూడా విధులు నిర్వర్తిస్తూ సాహసోపేతమైన పరిస్థితుల మధ్య కీలకమైన ఫొటోలను కెమెరాలలో బంధించి బాహ్య ప్రపంచానికి తెలియజేస్తూ ఉంటారని అన్నారు. ప్రకృతి అందాలను ప్రజలందరికీ కళ్లకు కట్టినట్టు చూపించే ఫొటోగ్రాఫర్లు అభినందనీయులని అమర్‌నాథ్ అన్నారు. కాలంతో పాటు పోటీపడుతూ ఎప్పటికప్పుడు వినూత్న ఛాయాచిత్రాలను ప్రజల ముందుకు తీసుకు వచ్చేందుకు ఫొటోగ్రాఫర్లు పడుతున్న శ్రమ మరువలేనిదని అన్నారు. విశాఖకు చెందిన ఫొటో జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో అవార్డు సాధించిన వారిని మంత్రి సత్కరించారు. 26 మంది ఫొటో గ్రాఫర్లు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు పివిఎన్.మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావుతో పాటు ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కెఆర్.దీపక్, కె.రామకృష్ణ, ఎస్కే.రఫీ, రాజా, విజయ్ కుమార్, మురళి, శ్రీను, విశ్వేశ్వర్ రెడ్డి, రాజేష్, వేణు, నగేష్ పాల్గొన్నారు.

కంటైనర్ బిజినెస్‌లో అగ్రగామిగా కాంకర్

ఎగుమతి, దిగుమతి వ్యాపారంలో అనూహ్య ప్రగతి

ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

స్టీల్‌ప్లాంట్, పోర్టు, ఎన్‌టిపిసి, ప్రైవేట్ సంస్థలతో ఎగ్జిమ్ సమన్వయం

- 'ప్రజాశక్తి'తో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్) జనరల్ మేనేజర్ కిశోర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్).. దేశంలోనే 60 టర్మినల్స్ కలిగి ఉండి జాతీయ ఆర్థిక పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. దేశం లోపల, బయటా కంటైనర్ బిజినెస్ (ఎగ్జిమ్) నిర్వహణలో అగ్రగామి సంస్థగా ఇది వెలుగొందుతోంది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఎదురుగా జాతీయ రహదారికి ఆనుకుని నగరం నడిబొడ్డున 108 ఎకరాల్లో అత్యుత్తమ మౌలిక వసతులు కలిగిన సంస్థ ఇది. 2017లో స్థానికంగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు (ఎంఎంఎల్‌టి) ప్రారంభమైంది. రెండు లక్షల చదరపు అడుగుల వేర్ హౌసింగ్ సౌకర్యం ఈ లాజిస్టిక్ పార్కులో ప్రత్యేకత. రైలు, రోడ్డు మార్గంలో కంటైనర్ బిజినెస్‌లో కొన్ని సంవత్సరాలుగా అనూహ్య ప్రగతిని కాంకర్ సాధిస్తోంది' అని కాంకర్ జనరల్ మేనేజర్ (జిఎం, ఐఆర్ఎస్ఇ) కెవిఎస్ఆర్‌కె.కిశోర్ వెల్లడించారు. 'ప్రజాశక్తి'తో ఆయన ముచ్చటిస్తూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కంటైనర్ ట్రాఫిక్ ఎలా ఉంది ? ఈ బిజినెస్‌లో ఏయే ఉత్పత్తులు ప్రధానంగా ఉంటాయి?

కంటైనర్ ట్రాఫిక్ చాలా బాగుంది. గతంలో రైస్ ఎగుమతి బల్కర్‌లో వెళ్లేది. నేడు వెస్సెల్స్‌లో కంటైనర్‌లో పంపుతున్నాం. బిజినెస్ బాగా పెరిగింది. 2022-2023లో కాంకర్ 64 వేల టిఇయులు దేశం బయట కంటైనర్ కార్గో చేసింది. దేశీయంగా 9 వేల టిఇయులు చేశాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నాన్ డొమెస్టిక్‌ను లక్ష టిఇయులకు పెంచనున్నాం. డొమెస్టిక్ కంటైనర్‌ను 14 వేల టిఇయులకు పెంచబోతున్నాం.

కాంకర్ టర్మినల్‌లో ఉన్న వసతులేమిటి ?

ఇక్కడ టర్మినల్ విశాలమైన ప్రదేశంలో కంటైనర్ బిజినెస్‌కు అనుకూలంగా ఏర్పాటు చేయబడింది. కంటైనర్ ఎగుమతి, దిగుమతులకు అవసరమైన ఉన్నతమైన మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. 24 గంటలూ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా కంటైనర్ కార్గో హ్యాండ్లింగ్ పూర్తిగా సిసి టీవీల నిఘాలో ఉంటుంది. కాబట్టి హేండ్లింగ్‌లో సరుకు తస్కరణ శాతం జీరో. పర్యావరణహిత కార్గో కూడా కాంకర్ ప్రత్యేకత.

కాంకర్ బిజినెస్‌కు ప్రధాన బూస్టింగ్ ఏమిటి ?

రైల్వే కనెక్టివిటీ ఉంది. నేరుగా జాతీయ రహదారికి ఆనుకుని, నగరంలోని ఎయిర్‌పోర్టుకు దగ్గరగా ఉండటంతో బిజినెస్ బూస్టింగ్‌కు ఒక కారణం. 8 రైల్వే లైన్‌లుండగా 5 హేండ్లింగ్ చేస్తున్నాం. ప్రధానంగా విశాఖ నగరంలో ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్ట్, ఎన్‌టిపిసి, గంగవరం పోర్టు వంటివాటితో సంబంధాలు నెరుపుతున్నాం. ఎన్‌టిపిసి ఫ్లై యాష్‌ను కూడా త్వరలో కంటైనర్ చేయబోతున్నాం. విశాఖలోని గేట్‌వే, శ్రావణ్ సంస్థలు కాంకర్ బిజినెస్‌లో పాల్గొంటున్నాయి.

ఇంకా ఇతర దేశాలతో ఏమైనా కంటైనర్ హేండిల్ చేస్తున్నారా?

కాంకర్‌కు దేశంలో 60 టర్మినల్స్ ఉన్నాయి. ఎగ్జిమ్ వ్యాపారం దేశం లోపలైతే సొంత కంటైనర్, దేశం దాటి ఎగుమతైతే అవుటర్ లైన్స్ (షిప్పింగ్‌లైన్స్) మాసిల్, హెచ్ఎస్‌సి, హెపాగ్లోయిడ్, నేవియో వంటి వివిధ షిప్పింగ్ లైన్స్‌లో పంపుతున్నాం. నేపాల్‌తో ట్రాఫిక్ బాగా హేండ్లింగ్ చేస్తున్నాం. రాయపూర్, నాగపూర్, గౌహతి, పాట్నాకు కంటైనర్ బిజినెస్ బాగుంది. వ్యవసాయ, ఆహార ఉత్పత్తులను వేరే దేశాలకు మన దేశంలోని ఈ రాష్ట్రాల నుంచి పంపుతున్నాం. రొయ్యలను ఈక్వెడార్‌కు ఎగుమతి చేస్తున్నాం.

కాంకర్ ప్రత్యేక సర్వీసులేమైనా ఉన్నాయా?

గుజరాత్‌లోని ముంద్రా, కత్వాస్ పోర్టులకు డబల్ డెక్కర్‌లో కంటైనర్ నిర్వహిస్తున్నాం. ఒక కంటైనర్‌లో 27 టన్నుల లోడు సహజంగా ఉంటుంది. కాంకర్ ద్వారా బిజినెస్‌కు గల అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునే ప్లాన్‌తో ముందుకు సాగుతున్నాం.

రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న విసి రాజు

రామకృష్ణ గీతాలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రామకృష్ణ గీతాలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని సెంచూరియన్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్ ఆచార్య జిఎస్ఎన్.రాజు అన్నారు. సినీ నేపథ్య గాయకులు వి.రామకృష్ణ 76వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని ఘంటసాల ప్రాంగణంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన వి.రామకృష్ణ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విజయనగరంలో పుట్టిన రామకృష్ణ నేదునూరి కృష్ణమూర్తి వద్ద శాస్త్రీయ సంగీత మెళకువలు నేర్చుకుని ఎన్నో కచేరీలు ఇచ్చారన్నారు. విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ మాట్లాడుతూ రెండు వందల చిత్రాలకు ఐదు వేలకు పైగా పాటలు పాడిన అపర ఘంటసాల వి.రామకృష్ణ అని అభివర్ణించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఎల్ఐసి డీఓ బొమ్మిడి సత్యనారాయణ, వి.రామకృష్ణ మెమోరియల్స్ అధ్యక్షుడు, గాయకుడు జి.రామకృష్ణ, సకల కళాకారుల సంఘం కార్యదర్శి, లెఫ్టనెంట్ లోకేశ్వరరావు, రచయిత పి.శ్యాం సుందర్ పాల్గొన్నారు.

300 మంది జనసేనలో చేరిక

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని బొర్ణగూడెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన జనసేన ఆత్మీయ సమ్మేళనంలో కుర్లా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి వంపుల గంగులయ్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. దీనికి ముందు స్థానిక పందిరిమామిడి జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ గిరిజనుల పట్ల పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, పోలవరం నిర్వాసితుల పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆయన తెలుసుకుంటున్నారని తెలిపారు. త్వరలోనే పవన్ కల్యాణ్ ఏజెన్సీ ప్రాంతంలో పర్యటిస్తారన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి విరివిగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల జనసేన పార్టీ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న న్యాయ సేవలపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజా రవాణా, విమానయానం, విద్యా, వైద్య సేవలు, పోస్టల్ సేవలు, మున్సిపల్ కార్పొరేషన్, ఎలక్ట్రిసిటీ బోర్డ్, టెలీ కమ్యూనికేషన్స్, ఉపాధి హామీ చట్టం అంశాల్లో న్యాయ సలహాలు అందించేందుకు వార్వా, నివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 5 గంటలకు ఎంవిపి సెక్టార్ 6లోని భద్రం పార్క్‌లో సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి కెఎం.కుమార్ మంగళం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'ఉపాధి' జాబ్‌కార్డుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉపాధి హామీ చట్టం అమలులో 2022-23లో పెద్ద ఎత్తున జాబ్ కార్డులు, పేర్ల తొలగింపును మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) విశాఖ జిల్లా అధ్యక్షులు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ చర్య గ్రామీణ ప్రాంతంలో, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతంలో ప్రజల బతుకుదెరువుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ తొలగింపులు ఎంత వరకూ సమంజసమో తెలుసుకునేందుకు ముగ్గురు సభ్యుల హెచ్‌ఆర్‌ఎఫ్, లిబ్టెక్ సంస్థల బృందం పార్వతీపురం మన్యం జిల్లా చింతలపాడు, బాలేసు (గుమ్మలక్ష్మీపురం మండలం), దుర్బిలి (కురుపాం మండలం)లో మూడు ఆదివాసీ గ్రామాలను ఈ నెల 19న సందర్శించిందని, ఆ పరిశీలనలో మూడు గ్రామాల్లో 30 మంది తొలగింపబడ్డ వేతన కూలీలను ప్రతినిధులు కలిశారని చెప్పారు. వారిలో ఐదుగురి తొలగింపులు మాత్రమే కారణాలతో కూడి ఉన్నాయన్నారు.